క్లుప్తంగా

ప్రెస్‌క్లబ్ భవనం ప్రారంభం



ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచటంతో పాటు ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించినందుకు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు బుధవారం ఎమ్మెల్యే రోహిత్‌రావు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మెదక్ పట్టణంలో నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరేష్‌గౌడ్, ప్రసాద్‌లతో పాటు పలువురు సీనియర్ విలేఖరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ఫొటోఫస్ ప్రోపరేటర్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మజహర్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రాన్ని మాజీ జెడ్పీటీసీ సర్వని సరోజ మల్లేశం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్లు నర్సింహారెడ్డి, పాపయ్య, మాజీ వైస్ ఎంపీపీలు విష్ణువర్ధన్ రెడ్డి, మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ సక్రు నాయక్, సీనియర్ నాయకులు విద్యాసాగర్, అనిల్, సంగయ్య, రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి మహేశ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగమేశ్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పంటమార్పిడితో అధిక లాభాలు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు ప్రతిసారి ఒకే రకం పంటను వేయకుండా పంటమార్పిడితో అధిక దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చని ఏడీఏ రాజ్‌నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని సూరారం రైతువేదికలో సేహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల సాగుకు ముందు పంట పొలంలో జీలుగ, జనుము సాగు చేసినట్‌లైతే సాగుభూమి సారం పొందడంతో పాటు సేంద్రియ ఎరువులను పొందవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానంలో పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీప్రవీణ్, సేహగల్ ఫౌండేషన్ సభ్యులు కల్యారెడ్డి, రాఘవేందర్, విక్రాంత్, మణిదీప్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

తైబజార్ వేలం రూ.36.20లక్షలు

–పశువుల సంత వేలం వాయిదా

తూప్రాన్: పురపాలక సంఘ కార్యాలయ ఆవరణంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి తైబజార్, పశువుల సంత వేలం పాట మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ వేలం పాటలో తైబజార్ వేలం పాటలో కూరగాయాల వ్యాపారి అమృత రూ.36.20 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. పశువుల సంత వేలం పాట ప్రభుత్వం నిర్ణయించిన రేటు రూ.2.64లక్షల కంటే తక్కువగా రూ.1.80లక్షలకు పాట పాడినందున వేలంను వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి పశువుల సంత వేలం పాటను సోమవారం రోజున ఉదయం 11:00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ అవరణంలో నిర్వహిస్తామన్నారు.

సమస్య పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని గోల్కొండ వీధి అంబేడ్కర్ కాలనీలో మురికి కాల్వల సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలోని గోల్కొండ వీధి అంబేడ్కర్ కాలనీ ప్రైమరీ స్కూల్ వెనుక వీధిలో మురికి కాల్వ లేకపోవడంతో పరిసర ప్రాంతంలో సుమారు 40 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా ప్రతినిధులు ఎన్నిసార్లు విన్నవించినా.. సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సంతోష్, అజయ్, ప్రజలు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై ప్రయాణించేదెలా?

అవస్థలు పడుతున్న ప్రజలు | పట్టించుకోని అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): పాడైపోయిన గ్రామీణ రోడ్లతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ గ్రామాలకు వెళ్లే పంచాయతీ రాజ్ ప్రధాన రోడ్లు భారీ గుంతలు పడ్డాయి. దీంతో పాటు కంకర తేలడంతో రోడ్డుపై రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఆయా గ్రామాల ప్రజలు మరోదారి లేక ఆ రోడ్డు గుండానే అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు. మండలంలోని ఎదుల్లాపూర్– ఉసిరికపల్లి, శివ్వంపేట నుంచి పిల్లుట్ల, కొత్తపేట, రత్నపూర్, అల్లీపూర్ గ్రామాలతో పాటు పలు గిరిజన తండాలకు వెళ్లే బీటీరోడ్డు శివ్వంపేట పెద్ద చెరువు కట్టపై పూర్తిగా పాడైపోవడంతో ప్రయాణం నరకంగా మారింది. తిమ్మాపూర్– పిల్లుట్ల, గంగాయిపల్లి నుంచి బిజ్లిపూర్ మీదుగా గోమారం ప్రధాన రోడ్డు వరకు రోడ్డు గుంతల మయంగా ఉంది. సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం నుంచి కానుకుంట రోడ్డుతో పాటు పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన ఎదుల్లాపూర్ - ఉసిరికపల్లి పీఆర్‌రోడ్డు దుస్థితి

ఈ విషయం గురించి పీఆర్ ఏఈ భాస్కర్‌రావు వివరణ కోరగా.. మండలంలో పాడైపోయిన పలు రోడ్లకు నిధులు మంజూరు అయినప్పటికీ టెండరు ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. త్వరలోనే టెండర్లు పూర్తయితే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలతో పాటు ఓ కేజీబీవీ ఉండగా, ఐదు ఉన్నత పాఠశాలల విద్యార్థులు 196 మంది చిలప్‌చెడ్ కేంద్రంగా పరీక్ష రాయనున్నారన్నారు. చిట్కుల్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు 68 మంది కొల్చారం మండలం రంగంపేట కేంద్రంలో పరీక్షలు రాయనున్నారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులతో తరగతి గదులు సిద్ధం చేశామన్నారు. విద్యార్థులు మొదటి పరీక్షకు గంట ముందు చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా కేంద్రంలోని మొబైల్స్, స్మార్ట్ వాచ్‌లు, తదితర వంటివి తీసుకురావొద్దన్నారు. తప్పనిసరిగా హాల్ టికెట్ తీసుకువావాలని తెలిపారు.



చిలప్‌చెడ్‌లో పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ విఠల్

ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలి

0కౌడిపల్లి(నర్సాపూర్): పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎంఈఓ బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని తునికి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్స్, పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మూడు గురుకుల పాఠశాలలో మొత్తం 608 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 21నుంచి కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 24 0మంది, కౌడిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 186 మంది, ముట్రాజ్‌పల్లి పాఠశాలలో 119 మంది పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ జాతర



కొత్తపేటలో ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొత్తపేటలో కొలువైన రేణుకా ఎల్లమ్మ జాతర కనుల పండువగా నిర్వహించారు. ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, బండ్లు, బోనాల ఊరేగించారు. అమ్మవారికి భక్తులు ఓడి బియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులను నిర్వాహకులు సన్మానించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు కల్లూరి హరికృష్ణ, మహేశ్‌గుప్తా, మన్సూర్, చంద్రగౌడ్, రమాకాంత్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, యాదగౌడ్, లాయక్, సత్యంగౌడ్, నరేందర్, రాజేందర్, నిర్వాహకులు సత్యంగౌడ్, పండరిగౌడ్, రామగౌడ్ ఉన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన



మాట్లాడుతున్న లక్ష్మీనర్సమ్మ

చేగుంట(తూప్రాన్): మానవ అక్రమ రవాణాపై మహిళా సంఘాల సభ్యులకు ఐకేపీ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం లక్ష్మీనర్సమ్మ మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం గ్రామాల్లో మహిళలు చేపట్టాల్సిన చర్యలను గురించి వివరించారు. మహిళా చట్టాలు, లైంగిక, శ్రమ, అవయవాల దోపిడి తదితర అంశాలపై అవగాహన కల్పించి గ్రామీణ మహిళలను చైతన్యవంతులు చేయాలని సూచించారు. గ్రామ సంఘాల అధ్యక్షులు వీఓలు, సీసీలు స్వామి, రామస్వామి, స్వేత, అంజనేయులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చేగుంట(తూప్రాన్): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మెదక్ స్పెషల్ బ్రాంచ్ సీఐ సందీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని చందాయిపేట ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోన్‌లను ఉపయోగించడంతో కలిగే నష్టాలు మోసాలు, వ్యసనాలకు బానిసలుగా మారితే జరిగే పరిణామాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సంతోష, సీనియర్ ఉపాధ్యాయులు అజిత, విఠల్‌రెడ్డి, నర్సింలు, ఉపాధ్యాయులు సలీం, వీణ, స్వప్న, రాములు, గిరిధర్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



చందాయిపేట పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సందీప్‌రెడ్డి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నర్సాపూర్‌లో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రేగోడ్‌లో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించినందుకు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



టేక్మాల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

26న తైబజార్ వేలం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామ పంచాయతీకి సంబంధించి 2025–26 సంవత్సరానికి ఈ నెల 26న తైబజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బలరాం రెడ్డి అన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు ధరావత్ చెల్లించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26న ఉదయం 10 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్రీడోత్సవాలు

రామాయంపేట(మెదక్): నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రామాయంపేటలో క్రీడోత్సవాలు నిర్వహించారు. స్థానిక మండల విద్యాధికారి శ్రీనివాస్ ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడలతో విద్యార్థుల మధ్య ఐక్యత పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. చెన్నయపల్లి జట్టు వాలీబాల్, సుతార్‌పల్లి జట్టు కబడ్డీ, యువజ్యోతి స్పోర్ట్స్ క్లబ్ ఫుట్‌బాల్, కబడ్డీ బాలికల విభాగంలో మంజీరా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆయా పాఠశాలల పీఈటీలు, యువజ్యోతి స్పోర్ట్స్ క్లబ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడిగా నాగరాజు శర్మ

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడిగా మెదక్‌కు చెందిన దేశాయిపేట నాగరాజుశర్మ ఎన్నికయ్యారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం జిల్లా ఎన్నికలు మంగళవారం తూప్రాన్‌లో జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌శర్మ సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్ శర్మ, జిల్లా కార్యదర్శిగా కాశీనాథ్ రావు, ఉపాధ్యక్షుడిగా నాగరాజు శర్మ, కోశాధికారిగా హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీకి మెదక్ డివిజన్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లింగమూర్తిశర్మ, ప్రధాన కార్యదర్శి వైద్య శ్రీనివాస్‌శర్మ, రాష్ట్ర సంఘం తరఫున వైద్య ప్రభాకర్‌శర్మ అభినందలు తెలిపారు.

మహాసభలు విజయవంతం చేయండి

పెద్దశంకరంపేట(మెదక్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని డీహెచ్‌పీ జిల్లా నాయకుడు సంగమేశ్వర్ విమర్శించారు. బుధవారం పెద్దశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22న మెదక్‌లోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించే దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మూడో మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బ్యాగుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం దాతలు అందిస్తున్న సహాయం సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం పుష్ప అన్నారు. మండల పరిధిలోని చండీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాష్ట్రీయ గ్రామీణ సాక్షరత మిషన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



టీఏలతో మాట్లాడుతున్న ఎంపీఓ కలీముల్ల

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీఓ కలీముల్ల తెలిపారు. బుధవారం ఉపాధిహామీ టీఏలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు చేసేందుకు కూలీలు తక్కువగా వస్తున్నారని కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అన్ని గ్రామాల్లో పనులు అడిగిన కూలీలకు పనులు కల్పించాలన్నారు. ప్రతీరోజు ఉదయం టీఏలు మూమెంట్ రిజిస్టర్‌లో రాసి ఫీల్డ్‌లోనికి వెళ్లాలని తెలిపారు. టీఏలు సమయపాలన పాటించడం లేదని, ఇంటివద్దనే ఉంటూ ఫీల్డ్‌లో ఉన్నామని చెప్తున్నారని ఇది సరికాదని హెచ్చరించారు. సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావొద్దని సూచించారు. కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఈసీ ప్రేంకుమార్, టీఏలు పాల్గొన్నారు.

హాజరుశాతం పెంచాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధి కూలీల హాజరు శాతం పెంచి, పనులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఏపీడీ బాలయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ ఆనంద్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించగా.. ఏపీడీ బాలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆనంద్ మాట్లాడుతూ.. ఈ నెల 20 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారి పూర్తి వివరాలు సేకరించడంతో పాటు పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, ఎపీఓ శ్యామ్, ఈసీ భగవాన్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు



తునికి నల్లపోచమ్మదేవి జాతరలో బండ్ల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): డప్పు చప్పుళ్ల శివసత్తుల పూనకాలు.. భక్తజనంతో మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం కిటకిటలాడింది. బుధవారం మూడోరోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి గ్రామ వతన్‌దారులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బండ్లు, ట్రాక్టర్లను ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పలువురు బోనాలను సమర్పించారు. డీఎంహెచ్ఓ శ్రీరామ్ ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవాదాయశాఖ అధికారులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశం, మాజీ సర్పంచ్ సాయిలు, సాయాగౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, శేఖర్ నాయకులు ఏర్పాట్లు చేశారు. మండలంలోని తునికి నల్లపోచమ్మ ఉత్సవాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

సీసీ రోడ్లతో గ్రామాల్లో కొత్తకళ



సీసీ పనులు ప్రారంభిస్తున్న ఆయా పార్టీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): సీసీరోడ్ల నిర్మాణంతో గ్రామాల్లో కొత్తకళ సంతరించుకోనుందని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నాయకులు అన్నారు. మండల పరిధిలోని చండీ గ్రామంలోని చండీకాంబ ఆలయం నుంచి గాంధీ విగ్రహం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.11 లక్షలు మంజూరు కాగా అన్ని పార్టీల నాయకులు బుధవారం పనులు బుధవారం ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా కృషి చేస్తామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, కుమార్‌గౌడ్, అనీల్, నారాగౌడ్, సంజీవచారి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చదువుతోనే సమాజంలో గుర్తింపు**

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ఉన్నత చదువుతోనే గుర్తింపు ఉంటుందని హెచ్‌ఎం బాలచంద్రం అన్నారు. బుధవారం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యాక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను హెచ్‌ఎం అందజేశారు.

◆ **వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, నవగ్రహపూజ, స్వామివారి అభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మారెడ్డి, రవికుమార్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

◆ **క్యాలెండర్ల ఆవిష్కరణ**

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ దళితవాడలో బుధవారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సమతామూర్తుల క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమరసత వేదిక జిల్లా ఆర్గనైజర్ నర్సింలు, గ్రామాధ్యక్షుడు గోపీనాథ్, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, కాలనీ వాసులున్నారు.

◆ **బోరుమోటార్ ప్రారంభం**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తిశివనూర్ ఎస్సీ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు మండల ప్రత్యేక అధికారి సహకారంతో బోరువేసి మోటార్ బిగించారు. బుధవారం ఎంపీడీఓ ఆనంద్ కుమార్ మోటార్‌ను ప్రారంభించారు.

◆ **దేశ భవితకు విద్యార్థులే సారథులు**

పాపన్నపేట(మెదక్): దేశ భవితకు విద్యార్థులే సారథులని హెచ్‌ఎం మహేశ్వర్ అన్నారు. బుధవారం పాపన్నపేట ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు అంజాగౌడ్, వెంకటేశం, నాగరాజు పాల్గొన్నారు.

◆ **తపస్‌లో చేరిన టీపీటీఎఫ్ నాయకురాలు స్వప్నశ్రీ**

వెల్దుర్తి(తూప్రాన్): టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి స్వప్నశ్రీ ఆ యూనియన్‌కు వీడ్కోలు పలికి టీపీయూఎస్(తపస్)లో చేరడంపై ఆ సంఘం జిల్లా నాయకుడు రంగారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భద్రయ్య, ఝాన్సీ హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆమెకున్న నిబద్ధతకు తపస్ జిల్లా కార్యవర్గంలో మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమించామన్నారు.

◆ **తైబజార్ వేలం వాయిదా**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించిన తైబజార్ వేలం పాటలో ఆశించిన ధర పలక పోవడంతో వేలం వాయిదా వేసినట్లు ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈఓ నాగభూషణం ఆధ్వర్యంలో తూబాజర్ వేలం నిర్వహించగా రూ.4లక్షల 10 వేల వరకు పాట పాడారు. డీఎల్‌పీఓ నిర్దేశించిన ధరకు తక్కువగా ఉండడంతో తైబజార్ వేలం పాటను ఈ నెల 22న నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **బిల్లు ఆమోదంపై హర్షం**

నర్సాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం పిల్లల పార్కులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మండలంలోని ఎల్లాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఆర్‌డీఓ మహిపాల్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కుమార్, నాయకులు నర్సింలు, ప్రవీణ్, నరేందర్,శ్రీకాంత్, వీరేశం తదితరులు అన్నారు.



చేగుంట(తూప్రాన్): ఎస్సీ వర్గీకరణ మంద కృష్ణతోనే సాధ్యమైనట్లు చేగుంటలో ఎమ్మార్పీస్ నాయకుడులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు.